సాక్షి చిత్తూరు

శనివారం । 1 । మార్చి । 2025



గజ వాహనంపై మల్లన్న

బంగారుపాళెం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లో భాగంగా మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారు గజవాహనంపై దర్శనమిచ్చారు.



పంటలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): పాతపేటలోని బొప్పాయి, కొబ్బరి తోటలను ఏనుగులు ధ్వంసం చేసి, అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చాయి.



నేడు సీఎం రాక

జీడీ నెల్లూరు: పింఛన్ల పంపిణీకి శనివారం జీడీ నెల్లూరుకు సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు.

న్యూస్‌రీల్

ఎన్‌సీడీ తప్పుల తడకపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్(కాణిపాకం) : ఎన్‌సీడీ తప్పుల తడకపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. 'సాక్షి' దినపత్రికలో బతికుండగానే మృతుల జాబితాలోకి అనే శీర్షికన ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. చిత్తూరు నగరంలోని సత్యనారాయణ పురంలో విచారణకు దిగారు. బాధితుడి ఇంటి వద్దకు ఆశా కార్యకర్తను పంపారు. వారు బతికి ఉన్నారా..అనే విషయంపై ఆరా తీశారు. తప్పు జరిగిందని.. ఆ తప్పు మాకు ఎలా జరిగిందో తెలియదని తప్పును కప్పి పుచ్చే ప్రయత్నం చేశారు. కాగా ఆ సర్వేలో జరిగిన లోటుపాట్లను జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఇద్దరు సిబ్బందికి తాఖీదులు ఇచ్చారు.

గుడుపల్లి ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీసు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గుడుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణానాయుడుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇంటర్మీడియట్ డీవీఈవో సయ్యద్ మౌలా ప్రిన్సిపల్‌కు నోటీసులు పంపారు. గుడిపాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణానాయుడు పరీక్షల విధుల పట్ల అలసత్వం వహించారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన కార్యాలయ మెటీరియల్ మామిడి తోటలో లభ్యం అయిన ఘటన సామాజిక మాధ్యమాల్లో వ్యాపించింది. ఈ ఘటనపై ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీసు జారీచేసినట్లు డీవీఈవో పేర్కొన్నారు.


రెడ్‌బుక్ రాజ్యాంగం.. ఆర్డీ విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీ విశ్వనాథ్

పుత్తూరు : అవినీతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పుత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కట్ట 2021 మే 18వ తేదీన కుంగింది. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ పుత్తూరు ప్రజలు భయాందోళన చెందారు. ఈ సంఘటన సమయంలో అనారోగ్యంతో చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ నాటి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా జిల్లా అధికారులను అప్రమత్తం చేసి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. దీంతో పుత్తూరు ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు. దీనిని జీర్ణించుకోలేని కూటమి నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం ఆనాటి మరమ్మతు పనుల్లో అవినీతి జరిగినట్లు ఆర్డీని విచారణకు ఆదేశించారు. దీంతో అనంతపురం రీజనల్ డైరెక్టర్ పి.విశ్వనాథ్ శుక్రవారం పుత్తూరు మున్సిపాలిటీకి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా ఇదివరకే ఆడిట్ జరిగిందని, అయినా పై అధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని, ఏదైనా జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరతామని తెలిపారు.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త పింఛన్లకు అవకాశం కల్పించలేదు. జిల్లాలో పేదలు, దివ్యాంగులు పొందుతున్న పింఛన్లలో కోత విధించారు. మరి కొంత మంది పింఛన్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారు. కొత్త పింఛన్‌ల కోసం ప్రజలు గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేస్తూనే ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ చూడకుండా పథకాలు, పింఛన్‌లను అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం నలుగురు లబ్ధిదారులకు పింఛన్‌లు ఇచ్చేందుకు ఆర్భాటం చేస్తోంది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు శనివారం గంగాధర నెల్లూరు పర్యటనకు విచ్చేస్తున్నారు.



కోతల పింఛన్

కొత్త పింఛన్ రాక పాయే.. ఉన్నవి ఊడిపాయే !

- జిల్లాలో కొత్త పింఛన్‌ల కోసం ఎదురు చూపులు
- వేల పింఛన్‌లు తొలగించిన కూటమి ప్రభుత్వం
- నలుగురికి పింఛన్‌లు ఇచ్చేందుకు రూ.40 లక్షలకు పైగా ఖర్చు
- నేడు జీడీ నెల్లూరు పర్యటనకు రానున్న సీఎం చంద్రబాబు

చిత్తూరు కలెక్టరేట్ : సూపర్ సిక్స్ హామీలిచ్చారు.. ఇంకా వాటిని ఎందుకు అమలు చేయలేదన్న ప్రశ్నకు సమాధానం లేదు. కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలుగా జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్‌లలో కోత విధిస్తూనే ఉన్నారు. జిల్లాలో ఏళ్ల తరబడి ప్రతినెలా ఠంఛన్‌గా పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులకు 'మీ పింఛను తాత్కాలికంగా నిలుపుదల చేయడమైంది' అంటూ అధికారులు నోటీసులు జారీ చేసి కోతల ప్రక్రియ చేపట్టారు. పింఛన్‌దారులకు పార్టీల రంగు పులిమి తొలగింపు చేపట్టారు. 2014–19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలో గ్రామాల్లో జన్మభూమి కమిటీల ఆగడాల తరహాలోనే ఇప్పుడు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వంలోనూ అధికార పార్టీ నాయకులు తమకు నచ్చని పింఛను లబ్ధిదారులను టార్గెట్ చేస్తున్నారు.

కూటమి నేతల జోక్యం

టీడీపీ–జనసేన –బీజేపీ కూటమి ప్రభుత్వం జులైలో తొలిసారి పింఛన్లు పంపిణీ చేసింది. పేరుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆధ్వర్యంలోనే ఆ కార్యక్రమం కొనసాగినా, ప్రతి చోటా పంపిణీ మొత్తం అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే జరిగింది. గతంలోనూ 2014–19 మధ్య వృద్ధులు, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్ల పంపిణీలో ప్రతి అంశంలోనూ అప్పటి అధికార టీడీపీకి సంబంధించిన జన్మభూమి కమిటీ సభ్యుల జోక్యం విపరీతంగా కొనసాగిన విషయం తెలిసిందే. 2019 తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ల మంజూరు మొదలు, పంపిణీలో ఎక్కడా ఏ రాజకీయ పార్టీ నాయకుడి జోక్యం లేకుండా, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంతృప్తి స్థాయిలో పథకం అమలు కొనసాగిన విషయం తెలిసిందే. గత ఐదేళ్ల పరిస్థితికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తూ అధికార పార్టీ నాయకులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తుండడం గమనార్హం. మరి కొన్ని ప్రాంతాల్లో తమకు ఓటు వేయలేదన్న కారణంతో పింఛను డబ్బు ఇవ్వకుండా నిలిపివేశారు.

నలుగురికి సీఎం చేతుల మీదుగా పింఛన్‌లు..

జిల్లాలోని గంగాధర నెల్లూరులో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన సాగనుంది. మధ్యాహ్నం 12.10 గంటల నుంచి 12.40 గంటల వరకు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. అధికారులు ముందస్తుగా ఎంపిక చేసిన నలుగురు లబ్ధిదారులకు సీఎం చేతుల మీదుగా పింఛన్‌లు అందజేయనున్నారు. నలుగురు లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేసేందుకు దాదాపు రూ.40 లక్షలకు పైగా ఖర్చు చేసి జిల్లా పర్యటనకు రావడం అవసరమా అని పలువురు జిల్లా వాసులు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్ ఒకేసారి లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ నగదు జమ చేశారని, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ప్రచార ఆర్భాటం కోసం ప్రతి నెలా నలుగురికి ఆయన చేతుల మీదుగా పింఛన్‌లు అందిస్తున్నారని జిల్లావాసులు వెల్లడిస్తున్నారు.

టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తగ్గుతున్న పింఛన్‌లు

2024 జులై నెలలో	548
ఆగస్టు	634
సెప్టెంబర్	1,513
అక్టోబర్	2,819
నవంబర్	3,670
డిసెంబర్	3,847
2025 జనవరి	4,598

పింఛన్ ఇవ్వడం లేదు....



నాకు అంగవైకల్యం ఉంది. వృద్ధాప్యం పైబడుతోంది. అంగవైకల్యం వల్ల ఎలాంటి జీవనోపాధి లేదు. 63 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఉంది. పింఛన్‌కోసం గత ఏడాది నవంబర్ 28వ తేదీన కలెక్టర్ ఆఫీసులో అర్జీ ఇచ్చాను. కొత్త పింఛనుకు ఎప్పుడు అవకాశం ఇస్తారో తెలియడం లేదు.

– విమల, దివ్యాంగురాలు, గంగాధర నెల్లూరు మండలం

కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా..



మాది బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లి గ్రామం. పూర్తి అంగవైకల్యం ఉండడం వల్ల నడవలేని పరిస్థితి. ఎటువంటి ఉపాధి లేదు. కొత్త పింఛన్‌కు అవకాశం కల్పిస్తే అప్పుడు దరఖాస్తు చేసుకోవాలంటున్నా. ఎన్నిసార్లు ఆఫీసుల చుట్టూ తిరిగినా చెప్పడం లేదు.

– లక్ష్మప్ప, దివ్యాంగుడు, బైరెడ్డిపల్లి మండలం.

అర్హత ఉన్నా ఇవ్వలేదు..



మాది తవణంపల్లి మండలం కుయ్యవంక ఎస్టీ కాలనీ. వృద్ధాప్య పింఛన్ కోసం ఐదు నెలలుగా ఎదురుచూస్తున్నాను. మండల అధికారుల వద్దకు వెళ్లి అడిగితే నోరు మెదపడం లేదు. కలెక్టర్ ఆఫీసులో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చాను. ఇంత వరకు న్యాయం చేయడం లేదు.

– గంగులమ్మ, వృద్ధురాలు, తవణంపల్లి మండలం.

ఎప్పుడిస్తారు సారూ..



మాది కార్వేటినగరం మండలం సుద్దగుంట గ్రామం. నా వయస్సు 80 సంవత్సరాలు. నాకు ఐదు నెలలకు ముందు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఉన్నట్టుండి ఆ పింఛన్ ఇవ్వడం మానేశారు. ఎందుకు ఇవ్వడం లేదని మండల అధికారుల దగ్గరకు వెళ్లి చాలా సార్లు అడిగాను. వారేమో ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

– మునెమ్మ, వృద్ధురాలు, కార్వేటినగరం

'పచ్చ' గుప్పిట్లో ఫారెస్టు భూములు

- యథేచ్ఛగా 70 ఎకరాలు ఆక్రమణ



స్థానిక నాయకుడు అక్రమించుకొన్న అటవీ ప్రాంతం, పారెస్టు వారు ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లు

వడమాలపేట (విజయపురం) : మండలంలోని బాలినాయుడు కండ్రిగ పంచాయతీ బంగారెడ్డి కండ్రిగ సమీపంలోని అటవీ ప్రాంతంలోని గుట్ట పోరంబోకుతో పాటు రిజర్వు ఫారెస్టు భూములను స్థానిక టీడీపీకి చెందిన ఓ నేత యథేచ్ఛగా ఆక్రమించుకొని మామిడి తోట సాగు చేసుకుంటున్నాడు. గతంలో వీటిని గుర్తించిన అటవీశాఖ అధికారులు ఆ పచ్చ నేతపై కేసు నమోదు చేసి అరెస్టు వారెంట్ ఇచ్చారు. అరెస్ట్ వారెంట్ ఉన్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆక్రమణలు మితి మీరిపోవడం సుమారు 70 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని యంత్రాలతో చదును చేసి ఆక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఎస్టీ కాలనీ వాసులు మీడియా ముందుకు వచ్చారు. జరుగుతున్న అన్యాయాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. ఎకరాలకు ఎకరాలు అటవీ భూములను ఆక్రమించుకోవడమే కాక ఎస్టీలకు చెందిన శ్మశాన స్థలాన్ని ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్ట పోరంబోకు స్థలాన్ని కబ్జా చేసి ఇష్టారాజ్యంగా పంచుకుంటున్నారని తెలిపారు. ఈ భూమి ఎకరం రూ.కోటి పలుకుతుందన్నారు. 30 కుటుంబాల ఎస్టీలకు సెంటు భూమి కూడా లేదని, అయితే పెద్ద రైతులు ఎకరాలకు ఎకరాలుగా భూములు ఆక్రమించుకొంటున్నారని వాపోయారు. ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకుని తమకు జీవనోపాధి నిమిత్తం పట్టాలివ్వాలని ఎస్టీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకోకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు. అయితే మీడియాకు సమాచారం అందించిన విషయం తెలియడంతో పచ్చనేత ఎస్టీ కాలనీ వాసులపై బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.



మీడియాతో మాట్లాడుతున్న స్థానికులు

నిమిషం ఆలస్యమైనా బయటికే!

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న డీవీఈవో సయ్యద్ మౌలా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు ఇంటర్మీడియట్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. మార్చి1న మొదటి సంవత్సరం విద్యార్థులకు, 3న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 20వ తేదీ వరకూ కొనసాగుతాయి. జిల్లాకు చేరిన మూడు సెట్ల ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. మొత్తం 50 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 30,652 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే హాల్‌టికెట్లు చేరాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 8 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్షల సమయంలో ఒక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఎవరైనా 08572–293867 నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

పెళ్లి కళ




గజ వాహనంపై స్వామి, సింహ వాహనంపై అమ్మవారు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామివారు అధికార నందిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారు కామధేనువుపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నేడు సభాపతి కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. నటరాజస్వామికి శివకామి సుందరితో కల్యాణం నిర్వహించనున్నారు. సభాపతి కల్యాణం జరిగే రాత్రిని ఆనందరాత్రిగా వ్యవహరిస్తారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో కరపత్రాలు తీసుకుని ఇంటింటికి వెళ్లారు. అధికారంలోకి వస్తే అంత చేస్తాం..ఇంత చేస్తాం అని మాయమాటలు చెప్పారు. అధికారంలోకి వచ్చాకా ప్రజలనే మరిచిపోయారు. సీఎం చంద్రబాబు చిత్తూరు జిల్లాకు చెందినప్పటికీ గతంలోనూ...ప్రస్తుతం మేలు చేసిందేమీ లేదు. పంటలకు గిట్టుబాటు ధర లేదు. ఆసుపత్రుల్లో మందులు లేవు. సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన భోజనం, నాడు–నేడు పనులు నిలిపివేత ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యలు విలయతాండవం చేస్తున్నా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అయితే శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ఏదైనా మేలు కలుగుతుందని ఆశించారు. ఎప్పటిలాగే అరచేతిలో వైకుంఠం చూపి బడ్జెట్‌ను మమ అనిపించారని జిల్లా వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఆశలు ఆవిరి

- బడ్జెట్‌లో అన్నివర్గాలకు మోసమే !
- జిల్లాకు ఒరిగిందేమి లేదు
- అన్ని వర్గాలను దగా చేసిన కూటమి సర్కారు
- జిల్లా అభివృద్ధికి నిధులు శూన్యం
- ఎన్నికల హామీలకు ఎగనామం
- ప్రభుత్వ తీరుపై జిల్లా వాసుల అసంతృప్తి

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తి అవుతోంది. చిత్తూరు జిల్లా నుంచి కూటమి ప్రభుత్వంలో (సీఎం చంద్రబాబు)తో సహా 6 గురు ఎమ్మెల్యేలున్నారు. అయితే శుక్రవారం రాష్ట్ర బడ్జెట్‌లో చిత్తూరు జిల్లా అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు మేలు చేకూరుతుందని అన్ని వర్గాలు ఆశతో ఎదురుచూశారు. చివరికి వారి ఆశలన్నీ అడియాశలుగా మారాయి. కూటమి ప్రభుత్వం మళ్లీ అన్ని వర్గాలను దగా చేసింది.

తల్లికి వందనంలో కోతలే...

ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున అందజేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది తల్లికి వందనం పథకం ఎగ్గొట్టి మోసం చేశారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తల్లికి వందనం పథకంలో నిధులకు కోత విధించారు. ఈ పథకానికి రూ.12 వేల కోట్లకు పైగా అవసరం ఉంటే బడ్జెట్‌లో రూ.8,276 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు.

నిరుద్యోగులకు అన్యాయం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేలు చేస్తుందని నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులు ఎంత మంది ఉంటే అంత మందికి నెలకు రూ.3 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అయితే తొమ్మిది నెలలు కావొస్తున్నా నిరుద్యోగులకు చిల్లిగవ్వ కూడా కేటాయించకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 4,78,869 మంది నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మరోసారి మోసగించింది.

సున్నా వడ్డీ రుణాలకు సున్నం

జిల్లా వ్యాప్తంగా 9193 డ్వాక్రా సంఘాలున్నాయి. డ్వాక్రా మహిళలకు ఈ బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం కుచ్చు టోపీ పెట్టింది. ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీకి సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో జిల్లాలోని డ్వాక్రా మహిళలు కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు.

రైతుకు రూ.20 వేలు పాయే..

జిల్లా వ్యాప్తంగా విస్తీర్ణం 2,56,402 హెక్టార్లు ఉంది. ఇందులో సాగు విస్తీర్ణం 41,796 హెక్టార్లు ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. అదే విధంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,18,386 మంది రైతులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే తొమ్మిది నెలల తర్వాత ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి అరకొర నిధులే కేటాయించింది.

జిల్లా సమాచారం

జిల్లాలోని రెవెన్యూ డివిజన్‌లు	04
జిల్లాలోని మండలాలు	32
జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు	822
జిల్లాలోని గ్రామ పంచాయతీలు	697
జిల్లా జనాభా	18.73 లక్షలు
పురుషులు	9.40 లక్షలు
మహిళలు	9.33 లక్షలు
రూరల్ జనాభా	15.04 లక్షలు
అర్బన్ జనాభా	3.69 లక్షలు

బాబు నిజస్వరూపం బయటపడింది



బడ్జెట్‌తో సీఎం బాబు నైజం బయటపడింది. మహిళలను నిలువునా మోసం చేశారు. నీకు రూ.1,500 అంటూ గొప్పగా ప్రచారం చేశారు. కానీ ఈ హామీకి బడ్జెట్‌లో అవకాశం లేదు. నిరుద్యోగులను నిలువునా ముంచేశారు. తల్లికి వందనం పథకానికి పంగనామాలు పెట్టారు. అన్నదాత సుఖీభవ అంటూ దగా చేశారు. రెండేళ్లకు కలిపి రూ.21 వేల కోట్లు కేటాయించాల్సి ఉంది. కానీ మొక్కుబడిగా కేటాయించి వారి నడ్డి విరిచారు.

– ఆర్కే రోజా, మాజీ మంత్రి


విద్యాభివృద్ధిపై చిన్నచూపు



ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిపై చిన్నచూపు చూడటం తగదు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పింది. అయితే ఆ అంశాన్ని పట్టించుకోకుండా 9.86 శాతం నిధులను మాత్ర మే కేటాయించింది. నాడు– నేడు పేజ్– 2లో పూర్తి చేయని తరగతి గదులు అనేకం ఉన్నాయి. వీటి ప్రస్తావన బడ్జెట్‌లో చర్చించకపోవడం బాధాకరం.

– జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పీఆర్‌సీ అమలుకు కేటాయింపులేవీ..



అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు మేలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు పీఆర్‌సీ అమలుకు కేటాయింపులే చేయలేదు. బడ్జెట్‌లో పీఆర్‌సీ, ఐఆర్ అమలుకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం దారుణం. సీపీఎస్, జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటన చేయలేదు.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ట్రెజరర్

టీడీపీ నేతల లాటరీ గుట్టు రట్టు

- లాటరీ డెన్‌పై పోలీసుల దాడి
- పన్నెండు మంది పట్టివేత



లాటరీ కేసులో పట్టుబడిన లోకేష్ ఆచారి (ఫైల్)

పలమనేరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలమనేరు అక్రమ వ్యాపారాలకు నిలయంగా మారిందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ సాగే లాటరీ వ్యాపారాలను ఓ యువనేత లీడ్ చేస్తూ పేదల జీవితాలను రోడ్డుపాలు చేస్తున్నాడంటూ గతనెల సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై పోలీసు నిఘా విభాగాలు కన్ను పెట్టాయి. ఈ నేపథ్యంలో పలమనేరు పట్టణంలోని మదనపల్లి రోడ్డు గుండుబావి సమీపంలో లాటరీ ఆఫీస్‌నే నిర్వహిస్తున్న నిందితులను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో 20వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి లోకనాథ ఆచారితోపాటు అతని తండ్రి సుబ్రమణ్యం ఆచారి, సోదరుడు యుగంధరాచారి, నారాయణస్వామి, శశిధర్, షంషీర్, శివకుమార్, మహ్మద్‌వాజిద్‌తోపాటు గంగవరానికి చెందిన మరో నలుగురిని అరెస్ట్ చేసి.. వీరినుంచి రూ.8,500 , సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు తమిళనాడు, కేరళ తదితర అంతర్రాష్ట్ర లాటరీ నిర్వాహకులతో సంబంధాలున్నట్లు విమర్శలున్నాయి. కాగా టీడీపీ నేతల ప్రమేయం ఉన్నందున ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడం లేదనే వాదన వినిపిస్తోంది.